# ౧౦ ఒకబుక్కింగు క్లార్కు పామిస్ట్రి

## (లేక)

## రయితు సమస్య

స్టేషను ప్లాట్‌ఫారముమీదికి రైలొచ్చింది. రైలు వచ్చిందీ అంటే అది ప్రయాణికుల్లో కొత్తజీవం పోసిందన్నమాటే. కూర్చున్న వాళ్ళు లేస్తారు. లేచినవాళ్ళు నడుస్తారు. నడుస్తూన్నవాళ్ల పరుగెడు తారు. నిజంగా ప్లాట్‌ఫారం అంతా ఒక్కసారిగా సచేతనమైపోతుంది.

ఆవచ్చింది కాకినాడకేసి వెడుతూవున్నబండి. అది చూచుకోడు ఓ చదువురాని మూర్ఖుడు. గుండె లవిసిపొయ్యేటట్టు పరుగెత్తుకొచ్చి "నిడదవోలుకు టిక్కెట్టండోయ్! బండి వెళ్ళిపోతుందండోయ్" అని ఊబుక్కింగు క్రంతదగ్గర కేకవేస్తూ వున్నాడు. "కాదయ్యా! ఈబండీ వెళ్ళిపోవాలి!" అంటే వినడు. బుక్కింగు క్లార్కు టిక్కెట్టు ఇవ్వడు. ఈ చదువురాని మూర్ఖుడు ఆరంధ్రాని కడ్డంగా నిల్చున్నాడు. చదువుకున్న ఓ క్రిస్టియన్ యువతి ప్లాట్‌ఫారంమీదనుంచి పరుగెత్తుకుంటూ వచ్చి "సార్! సార్! దయచేసి మూడు టిక్కెట్లిప్పించండి, కడియం, మేడపాడు, సామర్లకోట" అని బుక్కింగు బొఱ్ఱిదగ్గరకు చొఱబడి,

ఆ అడ్డంగావున్న మనిషినిచూచి "సార్ ! సార్ ! తప్పుకోండి" అంది. వాడు ఆ పెద్దన్నయ్య తనక్కూడా ఓటిక్కెట్టు నిడదవోలు కామెను తీసుకోమంటూ వెనక్కు తగ్గేడు. ఆమె ముందుకువెళ్ళి "సార్ ! సార్ ! దయచేసి" అంటూ చేయి బుక్కింగు బొత్తలోకి దూర్చి చూపు రైలు మీదకెట్టి "వెళ్ళిపోతూంది బండి, సార్ ! వెళ్ళిపోతూంది బండి !" అంది. బుక్కింగుక్లార్కు ఆమె చేయి చూచి "ఎన్ని టిక్కెట్లు ?" అని అడిగేలో స్టేషన్‌లో గంటకొట్టేరు. గార్డు ఈల వేసేడు. బండిఅంతా ఇంజన్ లాగుడు దేకుడు ధ్వనులు గావిస్తూవుంది.

రైతు పక్షనాయకు డొక డాపాళంగా రయితునివతలకు లాగి 'వాళ్ళూ వాళ్ళూ అంతా వొకటే — అంటే స్టేషన్‌మేష్టరూ, టిక్కట్టు కలక్టరూ, బుక్కింగుక్లార్కూ అందఱూ ఏకమే ! నీ మాట వినేవాళ్ళెవరు ? వెఱ్ఱి మెకమా ! నీకేమైనా అన్యాయం జరిగిందనితోస్తే వ్రాత మూలకంగా రాసి బోర్డు ఆఫ్ డైరక్టర్సుకు ఓపిటీషను పెట్టుకో, నేనున్నూ నాలుగురోజుల్లో ఇంగ్లాండు పోతూవున్నాను. అప్పు డీ కొశ్చన్ అక్కడ ఏజిటేట్టుచేసి నీగ్రీవెన్సు రిడ్రెస్సు అయ్యేటట్టు చూస్తాను" అన్నాడు.

"ఈ రైలుపట్టాలు ఇంగ్లాండుదాకా పొయ్యాయి ! వీటి తస్సాదియ్యా !" అని పెద్ద నవ్వు నవ్వాడురయితు. ప్లాట్‌ఫారం మీద బండీకి సైటుబెల్ వాయించాడు కూలీ. బుక్కింగుక్లార్కు టక్కుటక్కు చప్పుడు టిక్కట్లకోసం రండోయి అన్నట్లు తనకాడ చేసేడు. ఎవరిమట్టుకు వాళ్ళు టిక్కట్లుచ్చుకొన్న వాళ్ళు బండీ రావడంతోనే ఎక్కిపోయారు.

యువతి గుడ్లనీరు తిరిగిపోయినంత యిదికివచ్చేసేసి గేటమ్మట ప్లాట్‌ఫారంమీదికి పోబోతూవుంటే టిక్కట్‌కలక్టరు 'టిక్కట్ ?'

అన్నాడు. "ఉండండి సార్ ? టిక్కెట్లు దొరకలేదు. బండి వెళ్ళి పోతోంది" అంటూ దిక్కులేనట్లు ఆ ప్లాట్‌ఫారంమీద నాలుగు వెంపులా నిరాశ చూపులు చూసేస్తూవుంది.

"గార్డుతో చెప్పి ఎక్కు" అన్నాడు టిక్కట్‌కలక్టరు. బండి సగం ప్లాట్‌ఫారం దాటిపోయింది. గార్డుబండి ఆ దాటిపోయిన సగంలోనే వుండిపోవడంచేత గార్డు దొరికేటట్టులేదు. ఇంతకూ బండిలో టిక్కెట్టు లేకుండా మఱి ఇద్దఱప్పుడే ఎక్కిపోయినారు. వాళ్ళూ స్త్రీలే. వాళ్ళూ క్రిస్టియన్ యువతులే. వాళ్ళు ఊఁ తొంగి చూస్తూవున్నారు. "త్వరగా తీసుకురా !" అంటూ వున్నారు.

అంతలో ఇదంతా స్టేషనుమాష్టరుచూసి ఈలేసి బండిని అమాంతంగా ఆపేశాడు. బండిలో వాళ్ళంతా కదిలినబండి ఆగిందేమిటా అని తొంగిచూచేరు. ప్లాట్‌ఫారంమీద యువతి బుక్కింగు ఆఫీసులోకి వెళ్లి టిక్కెట్లు కొనుక్కు తెచ్చుకు తిరిగి బండియెక్కేదాకా బండినిల్చిపోవడం, అతి విడ్డూరంగా మహావిడ్డూరంగా కనుగొన్నారు. బండిలోకెక్కి యువతి తన వాళ్ళకు టిక్కెట్లుఅందిచ్చి ఆసీనయై పకపకానవ్వుతూ "సలాములు సలాములు" అంది స్టేషనుమాష్టరుతో.

నిడదవోలుకుటిక్కట్టు అడిగి నిరుత్తరుడై పోయిన చదువురాని మూర్ఖుడు ఆచర్యఅంతా చూస్తూ "ఆడదానికి టిక్కట్టిచ్చేరు. నాకిచ్చి నోరుకారు" అనిఅనేసి వూరుకున్నాడు. వాడెక్కే బండి ఏదో ఆబండి ఏవెంపుకు వెడుతుందో, దాని టైమెప్పుడో కూడా వాడికి తెలీదు.

తనకు టిక్కెట్టివ్వక ఆమె కెందుకు ముందు టిక్కెట్టిచ్చారనే ఆ చదువురాని మూర్ఖుని పంకం. వెంటనే కిటికీదగ్గరకు వెళ్ళి "ఇవ్వవయ్యా!

నాకూను టిక్కట్టువొకటి నిడదవోలుకు" అని గట్టిగా అటిచాడు పొలం కేకలా !

"నీవుక్రిస్టియన్‌వా ?" అన్నాడు బుక్కింగుక్లార్కు. "ఆఁ" అన్నాడు మొండిగాఆపల్లెటూరుమనిషి. "నీవు ఆడదానివా!" అన్నాడు. "ఆఁ" అన్నాడు. "నీవుయువతివా!" "ఆఁ". "అయితే పోయి స్టేషనుమేష్టరుతో చెప్పుకో ఆయనిస్తాడు టిక్కెట్టు" అన్నాడు బుక్కింగు క్లార్కు.

నిజమేఅనుకొని మనరయితు గేటుదాటి ప్లాటుఫారంమీదకు పోబో యేడు. అక్కడ టిక్కట్టుకలక్టరడ్డుతగిలి అడిగాడు టిక్కట్. "ఏమ య్యా ! టిక్కెట్టులేకుండా ఇందాకా ఆబుల్లిని పోనిచ్చావు. నన్నెందుకు పోనియ్యవు?" అని వెఱ్ఱిగా ముదలకించాడు రయితు. "నీవు క్రిస్టియన్ వా?" అన్నాడు టిక్కెట్టు కలక్టరు. "ఆఁ" అన్నాడు. "నీవు ఆడ దానివా?" "ఆఁ" 'నీవు యువతివా?' 'ఆఁ'. "స్టుపిడ్ ? అంతంత మీసాలు మొహాన్నెట్టుకొని, నిలువెత్తు ములకాలకర్ర చేతపట్టుకొని, ముతకదుప్పటి మొలకట్టుకొని, గోనిసంచీమూటతో, కిర్రుచెప్పుల్జోడుతో వున్న నిన్ను ఎవ్వడైనా క్రిస్టియన్ యువతివని అనుకోవడానికి అవకాశంవుందట్రా!పో! అవతలవుండు. అక్కడాకన్నం దగ్గఱిస్తారు టిక్కట్లు. ఇచ్చేదాకా కాచుకుండు. అట్టే పిచ్చికేకలు వెయ్యకు" అన్నాడు గవర్నరుగారిలా ఆటిక్కట్టుకలక్టరు.

అప్పటికప్పుడే నిడదవోలు కేసి పొయ్యేజనం పూటుకుంటూ వున్నారు స్టేషన్ షెడ్డులో. ఆగలాభాచూచి వాళ్ళంతా యీ కాపుచుట్టూ గుమిగూడేరు. ఎమిటి తగాయిదా అని అడిగారు. 'ఏమీలేదు. మీకెందుకు

నాగొడవ. మీరేం ఆర్చేవారా తీర్చేవారా ! పార్వతీ పరమేశ్వరులా ! వినాయకబ్రమ్మలా ? నేతిన్నగా స్టేషమాస్టరుగారికే సెప్పేసెయ్యాల' అని రణగొణ ధ్వని చేశేశాడు రయితు. లాభం లేకపోయింది.

రైతు ఇక, తననాయకుడుచెప్పినమాటలమీద కామోసు అనుకొని, నాయకుణ్ణే అర్జీరాసి పంపేసెయ్యమని, తన వ్రేలిముద్రకాగితం ఒకటి నాయకుడికిచ్చివేసి తనవూరు వెళ్ళిపోయినాడు. రయితుల వ్రేలిముద్రలు వేసిన తెల్ల కాగితాలంటే బ్లాంకు చెక్కుల్లా చెలామణీ అయిపోతాయి.

* * * *

Preference to ruling race
Even at the Booking case ;
Ryots are not at all great
Even at the Ticket gate ;
To illiterates grave injustice
Even in trains did not cease !

అని పెద్దక్షరాలతో ఎక్కడచూచినా "దొంగ లున్నారు జాగ్రత్త" అన్న మాదిరిగా "తిరుపతి దివ్యక్షౌర సుక్షేత్రం—తగ్గింపు రేట్లు" అన్న మోస్తరుగా బాహాట ప్రచార ప్రదేశాల్లో సుద్దముక్కలతోనూ మసిబొగ్గులతోనూ కనబడిపోయినాయి, వెంటనే ప్రతీరైల్లోనూ ప్రతీస్టేషన్ గోడమీదను, ఎగాదిగా చూచి ఇంగ్లీషురాని వాళ్లు పర్వర్టుగా తెలుసుకొంటున్నారు ఆ రాసిన ముక్కల్లోని అర్థము, రైతుకెక్కడా ఆఖరుకు రైళ్ళల్లో కూడా గౌరవం లేదని ఇంకా చిత్రం ఏమిటంటే లిజిల్లటివ్ కౌన్సిల్లో ప్రశ్నలడగబడ్డాయి. "ఎవరు ఆ ముగ్గురు యువతులు ? ఎవరు ఈ రయితు ? వాళ్ళెంతవఱకు

చదువుకున్నారు ? వీడెంత వఱకు ఆస్తి పరుడు ? ఆ బుక్కింగు క్లార్కు పేరేమిటి ? వానిమీద ఏమైనా హోంమెంబరుగారు చర్యతీసికున్నారా ?'' అని. సమాధానాలు కూడా వెంట వెంటనే వచ్చేసాయి. "ముగ్గురూ యువతులు కాదు. అందులో వొక్క ఆమెయే యువతి'' అనీ "రయితు వేలిముద్ర రయితు'' అని, మూడవప్రశ్నకు నోటీసు కావాలనీ, నాలుగవ ప్రశ్న ఎరైసు కాదనీ.

ఇలాగ్గా లిజిస్లేటివ్ కవున్సిల్లో మన ఈ రయితు సమస్య ఓ ప్రక్కను గాలించబడుతూవుంటే, డిపార్టమెంటల్ ఎంక్వైరీలో రైల్వే ఆధారిటీసు రెండోపక్క చెరిగేస్తూ వున్నారు.

ఏలాగూ అంటే—బోర్డు ఆఫ్ డైరక్టర్సునుంచి కాయితం మెద్రా సొచ్చింది. మెద్రాసునుంచి కాయితం గోదారి కొచ్చింది. అక్కడితో ఆగక అప్పటికప్పడే ఆ బుకింగుక్లార్కు ట్రావెలింగు టిక్కెట్టుకలక్టరుగా ట్రాన్సఫర్ అయిపోవడంవల్ల బండి బండీకి తిరుగుతూవుంది. ఎందు కోసం ? ఆ బుక్కింగుక్లార్కుయొక్క ఎక్స్ప్లనేషన్ కోసం—ఈ భారత ఖండంలో రయితు అంటే సామాన్యుడుకాడురో అని ఎక్కడి టిక్కెట్టు కలక్టర్సు రయితులకు గడగడలాడ్డమే ఆ పదిరోజులూ.

× × ×

బుక్కింగుక్లార్కు తన వుద్యోగం వూడిపోయేటట్టుంది అను కున్నాడు తన బసలో. బసఅంటే నీరు నిలిచేగట్టు క్రిందిపల్లంలో వో ఇరుకు పిచిగ్గూడు అనుకోండి. ఎక్స్ప్లనేషను సరిగ్గా రాయబోతే రాసే కలంకూడా తిరగదు అందులో—ఆ బసలో ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఒక అరడజను ఎక్స్ప్లనేషన్లు తోచినయి ఆ బుర్రకు.

మొదటిది మహాబోర్లైందిలేండి. ఏమిటంటే అది— "నేనెవ్వరికీ ప్రిఫెరన్సు యివ్వలేదు. దూర్చబడ్డ రెండు చేతులూ క్రంతలోకి వొకే పర్యాయం దూర్చబడ్డాయి అంటే యువతిచేయీ రయితుచేయీ రెండూ ఓకే మాదిరిగా కనిపించినయి. నేనెవరికీ ప్రిఫెరెన్సు ఇవ్వలేదు" అని అయితే గియితే కాస్సేపు రిఫ్లెక్టు చేసికొన్నాడు. ఆ సంజాయిషీ సత్య దూరం అని తెలుసుకున్నాడు. "Her palm was fairer and sweeter" అనుకున్నాడు. "దూర్చబడ్డాయి" అన్నదానితరువాత పంక్తి కొట్టేసి యిలా వ్రాశాడు. "యువతియొక్క లేతవాటు చామనచాయ నన్నాకర్షించింది" అని వ్రాశాడు. ఆలా వ్రాస్తే తన కడుపుమీద తానే కొట్టుకోవడంకాదా అని వొక్కింత వితర్కించేడు. వితర్కించుకొని "లేతవాటు చామనచాయ" మీద గీతపెట్టి, కింద హంసపాదుకొట్టి, పైని వ్రాశాడు. "భాగ్యరేఖలు నన్ను ఆకర్షించినాయి" అని. వాటిపై నిక కలం నడవలేదు. తోచినంతా వ్రాసి ముక్కుకు సూటిగా తన సంజాయిషీ పంపించాడు. ఎవరు ? బుక్కింగుక్లార్కు !

పైనుంచి అధికార్లు టెలిగ్రాం తీగమీదుగా లకోటా ప్రశ్నకొట్టారు. "Are you a palmist?" అని. "yes" అని తిరిగి జవాబు. వెంటనే పై అధికారినుంచి "Alright! explanation accepted. Made permanent. Given grade,,' అని ఎక్స్‌ప్రెస్‌వైరు !

దాంతో కౌన్సిలర్ల నోళ్లూ కట్టబడ్డాయి. ఇంగ్లాండు వెళ్ళివచ్చిన హేమాహేమీల ఎగురూ అణిగింది.

చదువురాని రైతు "ఏమైంద"ని అడిగితే చదువుకున్న ప్రతీవాడు మగాడిలా చేతిబెత్తం తిప్పుకుంటూ ఒకటే మాట. 'Every man on

this wide earth obliges first a fair palm. That's natural ! That's natural !' అన్నీ. అదీకాస్త తెనిగించి చెప్పండిబాబా అని రయి తంటే చెప్పేవాడేడీ! ప్రతివాడూ చప్పరించేసేవాడే !

—o—

| | | |
|---|---|---|
| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
| 23-11-1936 | రాజమంద్రి | "వినోదిని"లో |